సాక్షి గుంటూరు

7

శనివారం । 24 । ఆగస్టు । 2024




ఎన్నాడమ్మకు జలాభిషేకం

పిట్టలవానిపాలెం: మండలంలోని ఖాజీపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ ఎన్నాడమ్మ ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి మహిళలు జలాభిషేకం చేశారు.



శ్రావణమాస పూజలు

దాచేపల్లి: శ్రావణమాసం సందర్భంగా శుక్రవారం వాసవీ కన్యకా పరమేశ్వరి, వీర్ల అంకమ్మ ఆలయాలలో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. కుంకుమ పూజలు నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 589.10 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 8,221 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

న్యూస్‌రీల్

ఫిరంగిపురంలో 111.6 మి.మీ. వర్షం



కొరిటెపాడు(గుంటూరు): జిల్లావ్యాప్తంగా వర్షం కురిసింది. గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం వరకు 17 మండలాల పరిధిలో ఏకంగా 29.5 మిల్లీమీటర్లు సగటు వర్షపాతం నమోదైంది. ఫిరంగిపురం మండలంలో 111.6 మి.మీ. కుండపోత వర్షం పడింది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. పెదకాకాని మండలంలో 80 మి.మీ., గుంటూరు తూర్పు 56.4, గుంటూరు పశ్చిమ 40.8, దుగ్గిరాల 37.6, మేడికొండూరు 36.4, మంగళగిరి 30.6, చేబ్రోలు 28, ప్రత్తిపాడు 25.4, తాడికొండ 22.4, తాడేపల్లి 16.6, వట్టిచెరుకూరు 14.2, తుళ్లూరు 13.6, తెనాలి 8, కాకుమాను 4.6, పెదనందిపాడు 2.8, కొల్లిపర మండలంలో 2.4 మి.మీ. చొప్పున వర్షం పడింది.

యార్డులో 46,598 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 41,874 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 46,598 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.7,500 నుంచి రూ. 17,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.7,500 నుంచి 18,700 వరకు లభించింది. ఏసీ కామన్ రకం రూ. 9,000 నుంచి రూ. 15,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,500 నుంచి రూ. 18,800 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 14,813 బస్తాల నిల్వ ఉన్నట్లు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సీఎంఏ ఇంటర్ ఫలితాల్లో 'శ్రీమేధ' విజయకేతనం



గుంటూరు ఎడ్యుకేషన్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) శుక్రవారం ప్రకటించిన సీఎంఏ ఫైనల్ ఫలితాల్లో శ్రీమేధ విద్యాసంస్థల విద్యార్థులు అఖిల భారతస్థాయిలో టాప్ ర్యాంకులతో పాటు అత్యధిక ఉత్తీర్ణతా శాతాన్ని సాధించినట్లు సంస్థ చైర్మన్ అన్నా నందకిశోర్ తెలిపారు. గుంటూరు కొత్తపేటలోని క్యాంపస్‌లో జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీఎంఏ ఇంటర్ విభాగంలో షేక్ ఇర్ఫాన్ 800 మార్కులకు గాను 557 మార్కులతో అఖిల భారతస్థాయిలో 19వ ర్యాంకు, అన్నా ధీరజ్ 543 మార్కులతో 27వ ర్యాంకు, డి.లక్ష్మీ నరసింహ 460 మార్కులు, ఎన్.స్తుతి హర్షిత 448 మార్కులు, టి. రూపశ్రీ 439, టి. వరలక్ష్మి 436 మార్కులు సాధించారని తెలిపారు. ఇంటర్మీడియెట్ నుంచి సీఏ, సీఎంఏ కోర్సులకు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో క్రమశిక్షణతో కూడిన శిక్షణ అందించడం ద్వారా తమ విద్యార్థులు అఖిల భారతస్థాయిలో టాప్ ర్యాంకులు కైవసం చేసుకున్నారని వివరించారు. గత 19 ఏళ్లుగా సీఏ, సీఎంఏ కోర్సుల్లో 450కు ఆల్ ఇండియా ర్యాంకులను సాధించినట్లు చెప్పారు. సీఎంఏ ఇంటర్ పూర్తయిన విద్యార్థులకు ఐసీఏఐ నెలకు రూ.25వేలు ఇంటర్న్‌షిప్ ఫీజుతో మంచి అవకాశాలు కల్పిస్తోందన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, కామర్స్ ప్రొఫెషనల్‌గా ఎదగాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులను శ్రీమేధ చైర్మన్ అన్నా నందకిశోర్, డైరెక్టర్ శ్రీలక్ష్మి, సిబ్బంది అభినందించారు.

సాగునీటి సమాచారం


తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 7508 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. హైలెవల్ కాలువకు 340, బ్యాంక్ కెనాల్‌కు 1861, తూర్పు కెనాల్‌కు 760 , పశ్చిమ కెనాల్‌కు 210, నిజాంపట్నం కాలువకు 485, కొమ్మమూరు కాలువకు 2880 క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు.



టాస్క్‌ఫోర్స్‌తో ఇంటిదొంగల భరతం

ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఆసుపత్రుల్లో నిజాయతీ కలిగిన అధికారులతో టాస్క్‌ఫోర్స్‌ను నియమించాలి. ఇందులో పోలీస్, లాయర్, ప్రైవేట్ డాక్టర్ తప్పనిసరిగా ఉండాలి. ఉన్న సిస్టమ్ సక్రమంగా పనిచేయించాలి. ఇంటి దొంగలపై కన్నేసి ఉంచాలి. నైట్ డ్యూటీలు చేసే డాక్టర్లు, నర్సులకు సీసీ కెమెరాలతో కూడిన రెస్ట్‌రూమ్స్ ఉండాలి. ఏదైనా ప్రమాదాన్ని శంకించినపుడు వెంటనే స్విచ్ నొక్కితే కంట్రోల్ రూమ్‌కు సమాచారం చేరి, తక్షణ సాయం అందే వ్యవస్థను అమల్లోకి తీసుకురావడం తప్పనిసరి.

- డాక్టర్ డి.శారద, గైనకాలజిస్ట్, తెనాలి





మెడికోలకు ఇప్పటికీ అవే సమస్యలు

గుంటూరు మెడికల్ కాలేజీ, బోధనాసుపత్రిలో మహిళా మెడికోలకు నైట్‌రూమ్స్ ప్రత్యేకంగా లేవు. మేం చదివేటప్పుడు ప్రొఫెసర్ ఓపీ రూమ్ తాళాలు తెప్పించుకుని, అందులోనే విశ్రాంతి తీసుకునేవాళ్లం. రాత్రి డ్యూటీల్లో నిర్మానుష్య ప్రదేశంలో ఉండే బ్లడ్ బ్యాంక్ నుంచి బ్లడ్ అవసరమైతే హౌస్‌సర్జన్లు తీసుకురావాలి. మహిళలైతే అప్పట్లో తోడు అడిగి మరీ వెళ్లేవాళ్లం. హాస్టలులో 10 రూములకు అటాచ్డ్ కాకుండా, వాటికి చివర్లో నాలుగు బాత్ రూమ్‌లున్నాయి. ఇప్పటికీ అక్కడ అన్నీ అలాగే ఉన్నాయి. - డి.జీవనలత, ప్రభుత్వ వైద్యురాలు, తెనాలి

అవినీతి రామాయణం

- ప్రత్తిపాడులో ఓ ప్రజాప్రతినిధి హవా
- ప్రతి పనికీ కప్పం కట్టాల్సిందే..
- బార్ ఓనర్‌కు రూ.10 లక్షల ఫైన్
- గ్రావెల్, క్రషర్, కంకర లారీల యజమానుల నుంచి వసూళ్లు
- ఉద్యోగులకిచ్చే సిఫార్సులకు చేతివాటం
- టీడీపీ కార్యకర్తలనూ వదలని వైనం



సాక్షి ప్రతినిధి, గుంటూరు: రాష్ట్ర రాజకీయాల్లో గుంటూరు జిల్లాది కీలక భూమి అంటే అతిశయోక్తి కాదు. కారణం ఇక్కడి ప్రజలకు రాజకీయ చైతన్యం ఎక్కువ. ఈ జిల్లాలో ఒక నియోజకవర్గం ఇప్పుడు ప్రముఖంగా వినబడుతోంది. అభివృద్ధిలో అనుకుంటే పొరబడినట్లే ! ఎన్నికల ఫలితాలు వెలువడి రెండు నెలలే అయినా ఆ నియోజకవర్గం అవినీతిలో ముందుందని స్థానిక కార్యకర్తలే వాపోతున్నారు. ఉన్నతాధికారిగా పనిచేసిన అనుభవం, ప్రజల కష్టాలు తెలుస్తాయని నగరం చుట్టూ విస్తరించి ఉన్న ఈ నియోజకవర్గానికి ఎటువంటి సంబంధం లేకపోయినా గత ఎన్నికల్లో ఆయనకు సీటిచ్చారు. అధిష్టానానికి ఇప్పుడు కొత్త చిక్కులు మొదలయ్యాయి. ప్రతి పనిలో తన అవినీతి మార్కు రాజకీయాన్ని చూపిస్తున్నాడు. ఆయన దందా కేవలం ప్రజలకే పరిమితం కాకుండా గత ఎన్నికల్లో విజయానికి కృషి చేసిన కార్యకర్తలకు, స్థానిక వ్యాపారుల వరకు సాగుతోంది. సదరు ప్రజాప్రతినిధిపై స్థానికులు త్వరలోనే తిరుగుబాటు జెండా ఎగురవేసినా ఆశ్చర్యపడాల్సిన పనిలేదని ఓ స్థానిక టీడీపీ నాయకుడు బాహాటంగానే చెబుతున్నాడు.

బార్ యజమానికీ సెగ

ఎన్నికల సమయంలో ఈ నియోజకవర్గ పరిధిలోని వ్యాపారులతో పాటు బార్ యజమానులు సదరు నేతకి మద్యం సరఫరా చేశారు. కొందరు తక్కువ మొత్తంలో నగదు తీసుకుంటే మరికొందరు ఉచితంగానే అందజేశారు. అయితే, నియోజకవర్గ కేంద్రంలో ఒక ప్రధాన కూడలిలో ఉన్న బార్ యజమాని ఇవ్వలేదు. దీంతో ఆగ్రహించిన సదరు నాయకుడు ఎన్నికలు ముగిసిన తర్వాత రూ.10 లక్షలు కప్పం కట్టాలని కబురు పంపడంతో బార్ యజమాని ఆశ్చర్యపోయాడు. గత 15 ఏళ్లలో ఎప్పుడూ ఇటువంటి అనుభవం ఎదురుకాలేదని స్థానిక టీడీపీ నాయకుల వద్ద అతడు వాపోయాడు. అన్నట్లు బార్ యజమాని కూడా 'రామ.. రామ..' అనుకుంటూ కప్పం కట్టాల్సి వచ్చింది. ఇక్కడ కొసమెరుపు ఏంటంటే సదరు బార్ యజమాని కూడా టీడీపీ నాయకుడే. రానున్న లిక్కర్ పాలసీలో భాగంగా మద్యం దుకాణాలు మొత్తం తన అనుచరులే టెండర్లు వేస్తారని ముందుగానే హుకుం జారీ చేశాడు. తన మాట కాదని ఎవ్వరు వేసినా ఇబ్బందులు తప్పవని హెచ్చరికలు జారీ చేశాడు. ఎంతో కాలంగా మద్యం వ్యాపారం చేసుకుంటున్న తమను, నిన్న కాక మొన్న వచ్చిన ప్రజాప్రతినిధి వద్ద నడమేంటని వ్యాపారులు గుర్రుతో ఉన్నారు. కొందరు మంత్రి లోకేష్‌కు ఫిర్యాదు చేసే పనిలో ఉన్నారు.

లారీ వెళ్తే సుంకం చెల్లించాలి

ఈ నియోజకవర్గ పరిధిలో గ్రావెల్స్, క్రషర్స్, కంకర క్వారీలు అధికంగా ఉన్నాయి. తొలినాళ్లలో సదరు ప్రజాప్రతినిధిని కలిసిన వ్యాపారులతో బేరం ప్రారంభించడంతో బిత్తరపోవడం వారి వంతైంది. లాభనష్టాలతో పనిలేకుండా తన నియోజకవర్గ పరిధిలో వెళ్లే ప్రతి లోడ్ లారీకి కప్పం కట్టాల్సిందేనని చెప్పడంతో దిక్కుతోచని స్థితిలో క్వారీ వ్యాపారులున్నారు. ఎవరైనా ఎదురు తిరిగితే తన సామాజిక వర్గానికి చెందిన వారితో తన బెదిరింపులు, కేసులు పెట్టించడం పరిపాటిగా మారింది. ఈ దందా మొత్తం ఆయన అల్లుడి కనుసన్నల్లో జరుగుతున్నట్లు సమాచారం.

సిఫార్సు లెటర్లకు ఓ లెక్కుంది

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు బదిలీ అంశంలో స్థానిక ప్రజాప్రతినిధి వద్ద నుంచి సిఫార్సు లెటర్ తేవాలని చెప్పడం అతడికి వరంగా మారింది. తన పరిధిలో ఎంత మంది ఉద్యోగులున్నారు.. ఏఏ పదవుల్లో డబ్బులు బాగా వస్తాయో ఒక లెక్క వేసుకుని... పోస్టును బట్టి ఇంత అని వసూలు చేస్తున్నారు. డబ్బులు కట్టడానికి ఇష్టపడితేనే రావాలని తన అనుచరులతో చెప్పించడం వింత. కొందరు ఇలాంటి ప్రదేశంలో పనిచేసి చిక్కుల్లో పడటమెందుకని నిమ్మకుండిపోతున్నారు. మరికొందరు కప్పం సమర్పించుకుని సిఫార్సు లెటర్స్ తీసుకుంటున్నారు. ఆఖరికి మైనింగ్ వాహనాల వద్ద టోల్ వసూలు చేసేందుకు ఏర్పాటు చేసిన సంస్థలో ప్రైవేటు ఉద్యోగాలకు రికమండేషన్ కోసం కూడా డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలుగు తమ్ముళ్లు వాపోతున్నారు.

దారిమళ్లిన ఇన్‌పుట్ సబ్సిడీ



మంత్రి మనోహర్‌కు సమస్యను వివరిస్తున్న అత్తోట రైతులు



కౌలుకార్డులు చూపుతున్న రైతులు

- అత్తోట గ్రామసభలో రైతుల ఆరోపణ
- వల్లభాపురంలో మంత్రి మనోహర్‌కు వినతిపత్రం
- రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షల కుంభకోణం

తెనాలి: మిచాంగ్ తుఫాన్‌కు సంబంధించి, ఎన్నికల ముందు అప్పటి ప్రభుత్వం అందజేసిన ఇన్‌పుట్ సబ్సిడీ అసలు రైతులు, కౌలు రైతులకు దక్కకుండా ఇతరుల ఖాతాలకు దారిమళ్లిందని కొల్లిపర మండల గ్రామం అత్తోటకు చెందిన రైతులు ఆరోపించారు. దీనికి సంబంధిత అధికారులే కారణమని ధ్వజమెత్తారు. అత్తోట గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట శుక్రవారం జరిగిన గ్రామసభలో పలువురు రైతులు, ఇన్‌పుట్ సబ్సిడీ దారి మళ్లడంపై అధికారుల్ని నిలదీశారు. అనంతరం రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, దగ్గరలోని వల్లభాపురంలో గ్రామసభలో ఉన్నట్టు తెలుసుకుని అక్కడకు వెళ్లారు. మంత్రిని కలిసి సమస్యను విన్నవించారు. ఇన్‌పుట్ సబ్సిడీ మొత్తం వేరే ఖాతాలో జమ అవ్వడాన్ని, సంబంధిత వ్యక్తుల ఆధార్ కార్డు ఆధారాలను మంత్రికి అందజేశారు. దీనిపై విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని కోరారు.

రైతుల ఆరోపణలలో కొన్ని..

- కంచర్లపాలెం పరిధిలోని 7.5 ఎకరాలు కౌలుకు చేస్తున్న యర్రు శ్రీనివాసరావుకు 3.75 ఎకరాలకు మాత్రమే ఎకరాకు రూ.6,800 చొప్పున ఇన్‌పుట్ సబ్సిడీ బ్యాంకు ఖాతాల్లో జమయింది. మిగిలిన భూమికి రావాల్సిన మొత్తం వేరెవరికో జమ చేశారు.
- అత్తోటకే చెందిన రైతు యర్రు సత్యనారాయణ నేలపాడులో ఐదు ఎకరాలు సాగు చేస్తున్నారు. ఆయన సబ్సిడీ మొత్తం చినరావూరుకు చెందిన వేరొకరి బ్యాంకు ఖాతాల్లో జమైనట్టు ఆరోపించారు.
- వందకు పైగా రైతుల సబ్సిడీ దారిమళ్లడం , మరికొందరికి అసలు జమ కాకపోవడం జరిగిందని ఆరోపించారు. మొత్తం రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షలవరకు దారి మళ్లిందని ఆరోపించారు. వెంటనే విచారించి తమకు రావాల్సిన డబ్బులు ఇప్పించాలనీ, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు.

వీరిలో అత్యధికులు సాగుచేస్తున్న వ్యవసాయ భూమి తెనాలి రూరల్ మండల పరిధిలోని గ్రామాల్లోనే ఉంది. పలువురు నేలపాడు, కంచర్లపాలెం, కఠెవరం, తేలప్రోలు పరిసరాల్లోని పొలాల్ని సొంతంగా, కౌలుకు సాగు చేస్తున్నారు.

మల్లెపూల అలంకారంలో భ్రమరాంబ దర్శనం



శ్రావణ మాసం మూడో శుక్రవారం పెదకాకాని శివాలయంలో భ్రమరాంబ అమ్మవారిని మల్లెపూలతో అలంకరించారు. శ్రీ మల్లేశ్వరస్వామికి అర్చకులు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, శ్రీ భ్రమరాంబ అమ్మవారికి లక్ష మల్లెపూలతో ప్రత్యేక పూజ, హోమాలు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామివార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తెనాలి పట్టణానికి చెందిన రెడ్డి నవీన్‌కుమార్, విజయలక్ష్మి దంపతులు, నేలవెల్లి కోటేశ్వరి కుటుంబ సభ్యుల సహకారంతో అమ్మవారికి ప్రత్యేక పూల అలంకరణ చేసినట్లు ఆలయ ఉప కమిషనర్ డి. శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. నాలుగో శుక్రవారం గాజుల అలంకారంలో భక్తులకు అమ్మవారు దర్శనమిస్తుందని పేర్కొన్నారు. అదేరోజు ఉచిత సామూహిక శ్రావణ మాస వరలక్ష్మి వ్రతాలు, శ్రీ భ్రమరాంబ అమ్మవారిని లక్ష గాజులతో అలంకరించనున్నట్లు తెలిపారు.

- పెదకాకాని

కాసులు కురిపిస్తున్న 'సదరం'

- దళారులుగా మారిన జిల్లా వైద్యశాలలోని ఉద్యోగులు
- ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.30 నుంచి రూ. 60వేలు వసూలు
- ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు



రోగులతో పాటు క్యూలో నిలుచున్న వికలాంగులు

తెనాలి అర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలలో 'సదరం' క్యాంప్‌లు వైద్యులు, టెక్నీషియన్లకు కాసులు కురిపిస్తున్నాయి. అవుట్ సోర్సింగ్, శాశ్వత ఉద్యోగులు కొందరు దళారులుగా మారారు. లబ్ధిదారుల నుంచి అందినంత దోచుకునే పనిలో పడ్డారు. ఆర్థోపెడిక్ విభాగంలో సర్టిఫికెట్ల జారీలో పెద్దమొత్తంలో అవినీతి జరుగుతోందని ఫిర్యాదులు రావడంతో ఈనెల 18న సెకండరీ హెల్త్ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ తెనాలి వచ్చి విచారణ జరిపారు. దీన్ని బట్టి చూస్తే అవినీతి ఏ స్థాయిలో జరుగుతుందో అర్థమవుతోంది.

ప్రారంభంలో గుంటూరులో జారీ

వికలాంగులకు అనేక రాయితీలు, పింఛన్లు ఇవ్వాలని ఉద్దేశంతో ప్రభుత్వం సదరం సర్టిఫికెట్ల జారీని గతంలో ఏర్పాటు చేసింది. ప్రారంభంలో గుంటూరులోని ప్రభుత్వ వైద్యశాలలో వీటిని జారీ చేసేవారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల వికలాంగులు అక్కడకు వెళ్లడానికి అవస్థలు పడుతుండటంతో ఉన్నతాధికారులు జిల్లా పరిధిలోని ప్రధాన పట్టణాలలోని ప్రభుత్వ వైద్యశాలలో క్యాంప్‌లు ఏర్పాటు చేశారు. వారంలో మంగళ, శుక్రవారాలలో వీటిని నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. మీసేవా కేంద్రం ద్వారా స్లాట్లు బుక్ చేసుకునే పద్ధతిని ప్రవేశపెట్టారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా స్లాట్లు బుక్ చేసుకునే సదుపాయాన్ని కల్పించింది.

తెనాలి జిల్లా వైద్యశాలలో నాలుగు విభాగాల క్యాంప్‌లు

తెనాలి జిల్లా వైద్యశాలలో ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ, అప్తామాలజీ, సైక్రాటిక్ విభాగాల సదరం క్యాంప్‌లు నిర్వహిస్తున్నారు. తెనాలిలో సైక్రాటిక్ అధికారులు అందుబాటులో లేకపోవడంతో గుంటూరు నుంచి వైద్యులు ఇక్కడికి వచ్చి పరీక్షలు చేసి, సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. ప్రతి క్యాంప్‌లు ఒక్కో విభాగంలో 15 నుంచి 20 మందికి పరీక్షలు చేస్తున్నారు.



వికలాంగులకు ఇచ్చే సదరం సర్టిఫికెట్ ఇదే

దళారులుగా మారిన ఉద్యోగులు

తెనాలి జిల్లా వైద్యశాలలో సదరం సర్టిఫికెట్ల జారీలో కొందరు వైద్యులు, టెక్నీషియన్లు, సెక్యూరిటీ, శానిటేషన్, ఇతర శాఖల కింది స్థాయి ఉద్యోగులు భారీ అవినీతికి పాల్పడుతున్నారు. వికలాంగ శాతం ఎక్కువ వేయించి సర్టిఫికెట్ ఇప్పిస్తామని నమ్మబలికి ఒక్కొక్కరి నుంచి రూ.30 నుంచి 60 వేలు వసూలు చేస్తున్నారు. అంత ఎందుకని ఎవరైనా ప్రశ్నిస్తే దబాయిస్తున్నారు. వికలాంగులకు ప్రభుత్వం పింఛన్ కింద ప్రతినెలా రూ.ఆరు వేలు ఇస్తుందని, పది నెలలు కాదనుకుంటే పింఛన్‌కు అర్హత వచ్చే విధంగా శాశ్వత ర్టిఫికెట్‌ను వెంటనే ఇప్పిస్తామని చెబుతూ దళారులు దండుకుంటున్నారు. సదరం క్యాంప్‌లు జరిగే మంగళ, శుక్రవారాలలో సిబ్బంది వికలాంగుల కోసం వేచి ఉంటున్నారు. తమ ద్వారా తీసుకోకపోతే సర్టిఫికెట్ రాదంటూ బెదిరించి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈఎన్‌టీ విభాగంలో భారీ అవినీతి జరుగుతోందనే ఆరోపణలు ఎప్పటి నుంచో విన్పిస్తూనే ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సదరం సర్టిఫికెట్‌ల జారీలో అవినీతి జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన వికలాంగులు కోరుతున్నారు. దీనిపై జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సుబ్రహ్మణ్యరాజు వివరణ ఇచ్చేందుకు నిరాకరించారు.

వికలాంగులకు అవస్థలు


ఆస్పత్రిలో సాధారణ రోగులతో పాటు వికలాంగులకు పరీక్షలు చేయడంతో అవస్థలు పడుతున్నారు. కనీసం ప్రత్యేక కౌంటర్‌లు కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఎక్కువ సమయం క్యూలో నిలబడాల్సి వస్తోంది. తమకు ప్రత్యేక సమయం, కౌంటర్లను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ప్రకాశం పంతులు జీవితం ఆదర్శప్రాయం



ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జేసీ భార్గవ్ తేజ, అధికారులు

గుంటూరు వెస్ట్: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ఆంధ్ర కేసరి ప్రకాశం పంతులు జీవితం ఆద్యంతం ఆదర్శప్రాయమని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జేసీ భార్గవ్ తేజ కొనియాడారు. ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో లక్షల రూపాయల సంపాదన వదులుకుని స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక భూమిక పోషించిన ప్రకాశం పంతులు ధైర్య సాహసాలు నేటితరం కథకథలుగా చెప్పుకుంటారని తెలిపారు. అలాంటి మహనీయుడు రాష్ట్రంలో, దేశంలో జన్మించడం మన అదృష్టమని పేర్కొన్నారు. డీఆర్వో పెద్ది రోజా, జిల్లా ఇన్‌చార్జ్ బీసీ వెల్ఫేర్ అధికారి రఘు, పరిశ్రమల శాఖ జీఎం ఆర్.వెంకట్రావు, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్‌రెడ్డి, అధికారులు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



వాసవీ అమ్మవారికి ప్రత్యేక అలంకారం

నగరంపాలెం: గుంటూరులోని ఆర్.అగ్రహారం శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శ్రావణ శుక్రవారం సంబరాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలకరించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలను అందుకున్నారు.



అమ్మవారికి మహిళల పూజలు

వరలక్ష్మీ అమ్మవారికి బంగారు పుష్పాభిషేకం

నగరంపాలెం: శ్రావణ మాస కోటి కుంకుమార్చన మహోత్సవాల్లో భాగంగా స్థానిక అరండల్‌పేట శ్రీఅష్టలక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనారాయణస్వామి దేవస్థానంలో శ్రావణ శుక్రవారం గోపూజ, శ్రీచక్ర మేరుకు విశేష అభిషేకార్చనలు నిర్వహించారు. అనంతరం వరలక్ష్మి అమ్మవారికి 108 బంగారు పుష్పాలు, కలువ పూలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. విశేష హారతులు, మంత్రపుష్పం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ప్రధాన అర్చకులు మర్రిపాటి ప్రసాద్ మాట్లాడుతూ చివరి మంగళవారం 108 కిలోల గంధంతో విశేష పూజలు ఉంటాయని పేర్కొన్నారు.



బంగారు పుష్పాలతో అర్చన

క్లుప్తంగా

పటిష్ట రక్షణతో పరిశ్రమలను నిర్వహించాలి : కలెక్టర్



గుంటూరు వెస్ట్: జిల్లాలో ప్రమాదకర కేటగిరిల్లోని పరిశ్రమల్లో ప్రమాదాల్ని నివారించేందుకు యాజమాన్యాలు పటిష్ట రక్షణ ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, తెలిపారు. కలెక్టరేట్‌లోని వీడియో సమావేశంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలోని పరిశ్రమల్లో సంబంధిత శాఖలు తనిఖీలు నిర్వహించి నివేదిక అందించాలని ఆదేశించారు. ముఖ్యంగా ప్రమాద నివారణ ఏర్పాట్లలో రాజీ ఉండదని స్పష్టం చేశారు. నూతనంగా ఏర్పాటు చేస్తున్న పరిశ్రమలకు సింగిల్ డెస్క్ విధానంలో సత్వరమే విద్యుత్ కనెక్షన్లు అందించాలని చెప్పారు. పరిశ్రమల స్థాపనకు వచ్చే దరఖాస్తుల్ని పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రవాణా వాహనాలకే కాకుండా, వస్తు ఉత్పత్తి యూనిట్లకు రుణాలిచ్చేలా బ్యాంకులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 24 ఎంఎస్ఎంఈలకు పెట్టుబడి సబ్సిడీ, వడ్డీ రీఎంబర్స్‌మెంట్ సబ్సిడీ, పవర్ బిల్ సబ్సిడీకి సంబంధించి రూ.1.77 కోట్లు మంజూరు చేస్తూ కమిటీ తీర్మానించింది. సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం ఆర్.వెంకట్రావు, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ మహీపాల్‌రెడ్డి, చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివకుమార్ రెడ్డి, పరిశ్రమల యజమానులు పాల్గొన్నారు.

గుంటూరు వెస్ట్ డీఎస్పీగా జయరాం ప్రసాద్



పట్నంబజారు: గుంటూరు వెస్ట్ డీఎస్పీగా బి.ఎం. జయరాంప్రసాద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. 2018 బ్యాచ్‌కు చెందిన ఆయన గురజాల సబ్ డివిజన్, కాకినాడ దిశ స్టేషన్ల డీఎస్పీగా పని చేశారు. ప్రస్తుతం వైజాగ్‌లో పని చేస్తున్న ఆయన్ను గుంటూరు వెస్ట్ డీఎస్పీగా బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.బాధ్యతలు చేపట్టిన అనంతరం జయరాంప్రసాద్ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **6,200** గరిష్ఠం : రూ. **8,000**

మోడల్ ధర రూ. **7,000**

భయం పుట్టిస్తున్న కోల్‌కతా ఘటన



వైద్య విద్యను అభ్యసించి ఎంతో మందికి సేవ చేయాలనే విద్యార్థుల్ని చదివించేందుకు తల్లిదండ్రులు ఎంతో కష్టపడతారు. వారిని ఆశను నెరవేర్చి విద్య పూర్తి చేసుకోవాలనే లక్ష్యంతో ఎంతో దూరం నుంచి వచ్చి చదువుతున్నాం. కోల్‌కతాలో జరిగిన ఘటన తల్లిదండ్రులకు ఆందోళన కలిగిస్తోంది. ఈ ఘటన వింటుంటే మనం మానవ సమాజంలో బ్రతుకుతున్నామా ? అని భయమేస్తోంది.

– తీహ, మెడికల్ విద్యార్థి, ఎయిమ్స్ మంగళగిరి



ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దుర్మార్గం



కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై జరిగిన ఘటన విద్యార్థునులతో పాటు మహిళలను సైతం ఆందోళనకు గురి చేసింది. వైద్య విద్య చదువుకుని ప్రజలకు సేవ చేయాలనుకునే వారికి భయమేస్తోంది. సుప్రీంకోర్టు సుమోటాగా చర్యలు చేపట్టేవరకు ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దుర్మార్గం. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులలో ఆందోళన కలగకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి.

–బి. హారిక, వైద్య విద్యార్థిని, ఎయిమ్స్ మంగళగిరి

- మృత్యువాత పడుతున్న కోళ్లు
- వేసవిని తలపిస్తున్న ఎండ, ఉక్కపోత
- 10–15 శాతం తగ్గిన కోడిగుడ్ల ఉత్పత్తి
- సరిగా ఎదగని బ్రాయిలర్ కోళ్లు

ఎండలకు పౌల్ట్రీ పట్టి



చనిపోయిన కోళ్లు

తెనాలి: కోళ్ల పరిశ్రమకు వర్షాకాలంలోనూ వేసవి కష్టాలొచ్చాయి. దాణా ధరలు పెరగడంతో పాటు వేసవిని తలపిస్తున్న ఎండలతో కోళ్లు బేర్‌మంటున్నాయి. ఫారాల్లో తగినంత చల్లదనం నింపుతూ కంటికి రెప్పలా కాపాడుతున్నా, కొన్ని కోళ్లు గుడ్లు తేలేస్తున్నాయి. బ్రాయిలర్ కోడి బరువు తగ్గుతోంది. గుడ్ల ఉత్పత్తి పడిపోతోంది. అసలే శ్రావణ మాసం కారణంగా అంతంతమాత్రంగా ఉన్న ధరలకు తోడు వాతావరణ ప్రభావంతో కోళ్ల పరిశ్రమకు ఇది 'గుడ్డు' కాలం కాదంటున్నారు.

కోళ్ల పెంపకంతో రైతులకు ఉపాధి

ఉమ్మడి గుంటూరు జిల్లాలో తెనాలి, నరసరావుపేట, అమరావతి దగ్గర్లోని నిడుముక్కల వంటి ప్రాంతాలు కోళ్ల పరిశ్రమకు కేంద్రాలు. ఆయా ప్రాంతాలకు చెందిన 250–300 మంది రైతులు పెంపకంలో ఉన్నారు. పుష్కర కాలం కిందట 20 లక్షలుగా ఉన్న కోళ్లు రెట్టింపయ్యాయి. ప్రస్తుతం గుడ్లు పెట్టే లేయర్ కోళ్లు 40 లక్షల వరకు ఉంటే, మాంసం కోసం వినియోగించే బ్రాయిలర్ కోళ్లు అంతే సంఖ్యలో 40 లక్షల వరకు ఉన్నాయి.

అసాధారణ ఎండలతో కోళ్లు విలవిల

వర్షాకాలంలోనూ వాతావరణ మార్పులతో ఈసారి అసాధారణ ఎండలు కాస్తున్నాయి. ఎండలకు తోడు ఉష్ణతాపంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉష్ణోగ్రత పెరిగితే నేరుగా మనిషి మెదడుపై ప్రభావం చూపుతుందని అంటారు. బక్క ప్రాణి అయిన కోడి ఇందుకు మినహాయింపు కాదని తెలిసిందే. తీక్షణమైన ఎండ, ఉక్కపోతతో దాణా తినడం తగ్గించేశాయి. తగినంత మేత లేనందున ఆ మేరకు గుడ్లు ఉత్పత్తి కావడం లేదని కోళ్లఫారాల నిర్వాహకులు ఆందోళన పడుతున్నారు. వెయ్యి కోళ్లు ఉన్న ఫారంలో రోజుకు 700–800 కోడిగుడ్లు ఉత్పత్తి అవుతుంటాయి. ప్రస్తుత పరిస్థితుల్లో 650–700 మాత్రమే వస్తున్నాయని చెబుతున్నారు. అంటే కోడిగుడ్ల దిగుబడి 10–15 శాతం తగ్గిపోయింది. కొన్ని గుడ్లలో పెంకు కూడా సరిగా కట్టకపోవటం మరో అంశం.

అదనపు ఖర్చులతో సతమతం

ఎండలకు అతలాకుతమవుతున్న కోళ్ల ప్రాణాలు కొడిగడుతున్నాయి. వీటిని కాపాడుకోవటం రైతులు, కంపెనీల పర్యవేక్షకులకు ప్రయాసగా మారింది. ఫారం చుట్టూ పట్టాలు కప్పి, లోపల 'ఫాగర్స్' ఏర్పాటు చేసినా ఫలితం ఉండటం లేదు. స్ప్రింకర్లతో తడుపుతూ రోజంతా గడుపుతున్నా కనీసం 4–5 కోళ్లు చనిపోతున్నాయని కోళ్ల ఫారం రైతు శ్రీనివాసరావు చెప్పారు. మరోవైపు కోళ్ల దాణా రేటు కూడా పెరిగింది. దాణాలో ప్రధానమైన మొక్కజొన్న క్వింటాలు రూ.1700 ఉండేది. ఇప్పుడు రూ.2700లకు పెరిగిపోయింది. దీనితో దాణా ధర పెరిగి, గుడ్ల ఉత్పత్తి తగ్గిపోవడం సమస్యగా మారింది. ప్రస్తుతం మార్కెట్లో 100 కోడిగుడ్లు రూ.490 పలుకుతున్నా, రూ.600 ఉంటేనే గిట్టుబాటు కాగలదని రైతులు స్పష్టం చేస్తున్నారు.

బరువు పెరగని బ్రాయిలర్ కోళ్లు



మాంసానికి వినియోగించే బ్రాయిలర్ కోళ్లది మరో సమస్య. ఇవి కూడా మేత సరిగా తినకపోవడంతో సరైన బరువు తూగడం లేదు. 40–45 రోజుల వ్యవధిలో రెండు కిలోల బరువు తూగే కోడి, 50 రోజులకు కూడా రెండు కిలోలకు పెరగడం లేదు. ఒక్కో కోడి తూకం 150–200 గ్రాములు తక్కువగా ఉంటోందని రైతులు చెబుతున్నారు. దీనితో ఆ మేరకు సహజంగానే రేటు తగ్గిపోతోంది. శ్రావణ మాసం కావడంతో మాంసానికి డిమాండ్ తగ్గిన విషయం తెలిసిందే. కోళ్లు తగినంతగా పెరక్కుండా, మార్కెట్లో కూడా రేటు తగ్గడం బ్రాయిలర్ కోళ్ల ఫారాల రైతులకూ గడ్డుకాలంగానే చెప్పొచ్చు.

తగ్గిన కోడిగుడ్ల ఉత్పత్తి



కోళ్ల ఫారాలకు వేసవిలో ఉన్న సమస్యలు వర్షాకాలంలోనూ కొనసాగడం విచిత్రంగా ఉంది. వేసవిని తలపించే ఎండ, ఉక్కపోతతో కోళ్లు గిజగిజలాడుతున్నాయి. మేత తక్కువగా తింటున్నందున కోడిగుడ్లు తగ్గిపోయాయి. వంద గుడ్లు రూ.600 అయితేనే గిట్టుబాటయే పరిస్థితి.

– కూరపాటి రవిశేఖర్‌రెడ్డి, పౌల్ట్రీ నిర్వాహకుడు, కొల్లిపర

టీడీపీ నేతల వీరంగం

- అధికారులపైకి గొడవకు దిగిన నేతలు
- ఏ కార్యక్రమం చేసినా తమకు చెప్పాలిందేనని హడావుడి
- పోలీసులు కలుగజేసుకోవడంతో నిశ్శబ్దం

గుంటూరు రూరల్: ప్రభుత్వం మాది.. అధికారం మాది.. అధికారులైనా ఏ పనిచేసినా మాకు చెప్పి చేయాల్సిందే... లేదంటే ఇక్కడి నుంచి ట్రాన్స్‌ఫర్ పెట్టుకుని వెళ్లిపోండి అంటూ రూరల్ మండలం తోకావారిపాలెం గ్రామంలో టీడీపీ నాయకులు వీరంగం వేశారు. శుక్రవారం గ్రామ సభకు వచ్చిన అధికారులపై వివాదానికి దిగారు. వేళ్లు చూపుతూ పంచాయతీ కార్యదర్శులు, గ్రామ స్థాయి అధికారులపైకి ఆందోళనకు దిగారు. దీంతో బెంబేలెత్తిన అధికారులు అక్కడే ఉన్న పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలికి చేరుకోవడంతో వివాదం సద్దుమణిగింది. గ్రామంలో గ్రామ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన సభలో వివాదాలు సృష్టించవద్దని హితవు పలికారు. దీంతో గ్రామాల్లో విధులు నిర్వహించుకోవాలన్నా టీడీపీ నాయకులకు చెప్పే చేయాలా? కనీసం తమకు స్వేచ్ఛ లేదా ? అని అధికారులు చర్చించుకున్నారు. ప్రతి ఒక్కరూ టీడీపీ నాయకులం అంటూ బెదిరిస్తుంటే ఎలా పని చేయాలని ఆందోళనకు గురవుతున్నారు. ప్రతి గ్రామంలో పరిస్థితి ఇలానే ఉందని, అధికారుల్ని పార్టీ నాయకులు చిన్నచూపు చూస్తూ బెదిరింపులకు పాల్పడటం సమంజసం కాదని చర్చించుకుంటున్నారు.

విజ్ఞాన్ వర్సిటీకి 'అబెట్' అక్రిడిటేషన్



చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీకి ప్రతిష్టాత్మక యూఎస్ఏ బేస్డ్ అబెట్ (అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ)అక్రిడిటేషన్ లభించిందని వైస్ చాన్స్‌లర్ కల్నల్ పి.నాగభూషణ్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ దేశంలో కేవలం 12 యూనివర్సిటీలకు మాత్రమే అబెట్ అక్రిడిటేషన్ ఉందని, అందులో విజ్ఞాన్ యూనివర్సిటీ కూడా ఒకటని పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలలో అబెట్ అక్రిడిటేషన్‌ను సాధించిన మొట్ట మొదటి యూనివర్సిటీగా విజ్ఞాన్ నిలిచిందని చెప్పారు. యూనివర్సిటీలోని ఐదు బ్రాంచ్‌లకు (సీఎస్ఈ, ఈఈఈ, ఈసీఈ, మెకానికల్, బయోటెక్నాలజీ) అబెట్ అక్రిడిటేషన్ ఆరు సంవత్సరాల పాటు లభించిందని వెల్లడించారు. అమెరికా నుంచి వచ్చిన 10 మంది సభ్యుల బృందం యూనివర్సిటీలో మూడు రోజుల పాటు తనిఖీ నిర్వహించి అక్రిడిటేషన్‌ను అందించిందని వివరించారు. అబెట్ అక్రిడిటేషన్ వల్ల విదేశాలలో ఉన్నత విద్యతో పాటు ఉపాధి అవకాశాలు బాగా మెరుగవుతాయని ఆయన తెలియజేశారు. యూఎస్ఏ బేస్డ్ అబెట్ అక్రిడిటేషన్ పొందడంలో కృషి చేసిన ఐక్యూఏసీ సిబ్బందిని చైర్మన్ లావు రత్తయ్య అభినందించారు.

పరిపాలనాదక్షుడు ప్రకాశం

- ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి
- ఘనంగా ప్రకాశం పంతులు జయంతి



ఆంధ్రకేసరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మాజీ మంత్రి మేరుగ నాగార్జున, జిల్లా అధ్యక్షులు మందపాటి శేషగిరిరావు

పట్నంబజారు: విలక్షణ రాజకీయంతో, విప్లవాత్మక సంస్కరణలతో మొట్టమొదటి ముఖ్యమంత్రిగా రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేసిన మహనీయుడు టంగుటూరి ప్రకాశం పంతులు అని ఎమ్మెల్సీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పార్టీ కేంద్ర కార్యాలయ పర్యవేక్షకులు లేళ్ల అప్పిరెడ్డి కొనియాడారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని శుక్రవారం శంకర్‌విలాస్ సెంటర్‌లోని ప్రకాశం చౌక్ వద్ద ఆంధ్రకేసరి అభిమాన సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావుతో కలిసి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ పరిపాలన అంటే ఎలా ఉండాలో, ఆచరణలో చూపిన గొప్ప పరిపాలనాదక్షుడు ప్రకాశం పంతులు అని కీర్తించారు. సామాన్య కుటుంబంలో పుట్టి, వారాలు చేసుకుంటూ చదువుకుని ఆంధ్ర రాష్ట్ర మొట్ట మొదటి ముఖ్యమంత్రి అయిన ధీరోదాత్తుడుగా పేర్కొన్నారు. మాజీ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున మాట్లాడుతూ ప్రకాశం పంతులు దేశం కోసం, దేశ స్వాతంత్ర్యం కోసం తన యావదాస్తినీ త్యాగం చేశారన్నారు. ముఖ్యమంత్రిగా పనిచేసిన స్వల్ప కాలంలోనే ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి కోసం అనేక సంస్కరణలు ప్రవేశపెట్టిన మార్గదర్శకుడని కొనియాడారు. ఆయన త్యాగనిరతి అందరికీ ఆదర్శనీయమని తెలిపారు. అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, కార్పొరేటర్లు పాపతోటి అంబేడ్కర్, దూపాటి వంశీ, షేక్ రోషన్, అచ్చాల వెంకటరెడ్డి, పడాల సుబ్బారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బత్తుల దేవానంద్, గీతా మందిరం చైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్, విజయమాధవి, సతీశ్, సింగు నరసింహారావు, ఆలా కిరణ్ , నర్సిరెడ్డి, పాత్తూరి శ్యామ్, భాగ్యారావు, సుబ్బరాజు, రేజేటి నవీన్, విజయారెడ్డి, మహేంద్ర గులేచా, పండ్ల నారాయణ పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న విశ్వవిద్యాలయం అధికారులు



నివాళులు అర్పిస్తున్న ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

ఎన్జీరంగా వర్సిటీలో..

గుంటూరు రూరల్: ఆంధ్ర రాష్ట్ర మొట్టమొదటి ముఖ్యమంత్రిగా టంగుటూరి ప్రకాశం పంతులు సేవలు మరువలేనివని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ జి. రామచంద్రరావు తెలిపారు. నగర శివారుల్లోని లాంఫాం నందున్న విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో శుక్రవారం ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అగ్రికల్చర్ డీన్ జి. కరుణాసాగర్, పీజీ స్టడీస్ డీన్ ఎ.వి. రమణ, కమ్యూనిటీ సైన్స్ డీన్ బి. శ్రీలక్ష్మి, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ పి.వి.సత్యనారాయణ, డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ బి. ప్రమీలారాణి, డీఎస్‌ఏ పి. సాంబశివరావు, కంట్రోలర్ బి.వి.ఎస్. ప్రసాద్, జి. శివన్నారాయణ పాల్గొన్నారు.

గుంటూరు రేంజ్ ఐజీ కార్యాలయంలో..

నగరంపాలెం: నగరంలోని గుంటూరు రేంజ్ ఐజీ కార్యాలయంలో శుక్రవారం టంగుటూరి ప్రకాశం పంతులు 153వ జయంతి వేడుకలు నిర్వహించారు. ప్రకాశం పంతులు చిత్రపటానికి రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

త్యాగశీలి ప్రకాశం పంతులు

- ఏపీ హైకోర్టు న్యాయమూర్తి, జస్టిస్ బి.కృష్ణమోహన్
- అమరావతి తెలుగు వెలుగులు పురస్కారాలు ప్రదానం



పురస్కారాలు అందజేస్తున్న జస్టిస్ బి.కృష్ణమోహన్ తదితరులు

నగరంపాలెం: టంగుటూరి ప్రకాశం పంతులు త్యాగశీలి అని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి, జస్టిస్ బి.కృష్ణమోహన్ అన్నారు. సాంస్కృతిక బంధు సారిపల్లి కొండలరావు సహస్ర పూర్ణ చంద్ర దర్శన సందర్భంగా యువ కళావాహిని ఆధ్వర్యంలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై అమరావతి తెలుగు వెలుగులు పురస్కారాల ప్రదానోత్సవ సభ నిర్వహించారు. యువ కళావాహిని సంస్థ అధ్యక్షులు లంక లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి, జస్టిస్ బి.కృష్ణమోహన్ మాట్లాడుతూ నేటితరం యువత టంగుటూరి ప్రకాశం పంతులను స్ఫూర్తిగా తీసుకుని, దేశం కోసం ముందుకు సాగాలని సూచించారు. అనంతరం రంగస్థల నటులు, దర్శకులు తాళాబత్తుల వెంకటేశ్వరరావు, నాట్య గురువు డాక్టర్ కాజా వెంకటసుబ్రహ్మణ్యం, రచయిత షేక్ అబ్దుల్ హకీం జాని, వ్యాఖ్యాత సరస్వతి, ప్రాసరత్న ఏ.వి.కె.సుజాత, సంగీతంలో ఎం.వై.శేషురాణిలకు అమరావతి తెలుగు వెలుగులు పురస్కారాల్ని అతిథులు అందించారు. సభలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, రామరాజు ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు, ఆలయ పాలక మండలి అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, సిద్ధేంద్ర ఆర్ట్స్ అకాడమి నిర్వాహకులు డాక్టర్ దేవసేన, కళావాహిని ప్రధాన కార్యదర్శి జి.మల్లికార్జునరావు, డి.తిరుమలేశ్వరరావు, సయ్యద్ జానీ బాషా పాల్గొన్నారు. తొలుత గాయని, గాయకులు పత్రి లలితబాబు, పత్రి గాయత్రీదేవి మధుర గీతాల్ని ఆలపించారు. కళాకారుల్ని అతిథులు సత్కరించారు.

గ్రామాల్లో పోలీస్ 'వారధి'

వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడులో ప్రారంభించిన ఎస్పీ సతీష్‌కుమార్



ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ

ప్రత్తిపాడు: నేరాల్ని నియంత్రించడం, నేర నియంత్రణలో ప్రజల్ని భాగస్వాములను చేయడం, పోలీసు యంత్రాంగానికి ప్రజలకు మధ్య సంబంధాల్ని బలోపేతం చేసేందుకు జిల్లా పోలీస్‌శాఖ కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'వారధి'– విలేజ్ విజిట్ పేరుతో జిల్లా పోలీస్ బాస్ పల్లెబాట పట్టారు. అందులో భాగంగా వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడులో శుక్రవారం రాత్రి జిల్లా ఎస్పీ ఎస్. సతీష్‌కుమార్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రస్తుత సమాజంలో మన చుట్టుపక్కల జరుగుతున్న నేరాలు, తగాదాల వలన జరిగే నష్టాలు, మహిళలపై జరిగే నేరాలు, రోడ్డు ప్రమాదాల వల్ల కలిగే నష్టాలు, సైబర్ క్రైం, నిషేధిత ఉత్పత్తుల క్రయ, విక్రయాలు, అమ్మాయిల మిస్సింగ్.. వంటి పలు అంశాలపై లఘుచిత్రాల రూపంలో వీడియోలను స్థానిక ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన ప్రొజెక్టర్ల ద్వారా ప్రదర్శించి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో ఎవ్వరైనా గంజాయి వాడుతున్నా, సరఫరా చేస్తున్నట్లు గానీ తెలిస్తే కచ్చితంగా పోలీసు స్టేషనులో సమాచారం అందించాలని కోరారు. పోలీసులకు తప్పు చేసిన వారు మాత్రమే భయపడాలని, తప్పు చేయని వారు భయపడాల్సిన పనిలేదని ఎస్పీ తెలిపారు. కులాలు, మతాలు, పార్టీలు అని చూడకుండా, నిజాయతీగా తప్పు చేసిన వారిపైనే చర్యలు తీసుకుంటామన్నారు.

చదువుకు సపోర్టు

యువతీ,యువకులు చక్కగా చదువుకోవాలని, అందుకు కావలసిన గైడెన్స్, సపోర్ట్‌ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. గ్రామంలోని ప్రధాన జంక్షన్లన్నింటిలో గ్రామస్తులంతా కలిసి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నేరాల నియంత్రణతో పాటు నేరం జరిగినప్పుడు నిందితుల్ని త్వరితగతిన గుర్తించేందుకు ఉపకరిస్తాయని తెలిపారు. ప్రతి గ్రామంలోనూ గ్రామ శాంతి కమిటీలు ఏర్పాటు చేస్తామని, వాటి సహాయంతో సంబంధిత ఎస్‌హెచ్‌వోలు లా అండ్ ఆర్డర్ సమస్యలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాల సమాచారాన్ని ముందస్తుగా తెలుసుకుని పటిష్ట చర్యలు తీసుకుంటారని చెప్పారు. ఆయన వెంట సీఐ ఎం. రమానాయక్ తదితరులున్నారు.